రోజురోజుకీ
భారమవుతున్న
బ్రతుకుతో
ఓ సగటుజీవి!

# తెల్లముఖం తెల్లకార్డు

షేక్ అహ్మద్‌వలీ కథ

ఉదయపు ఎండ నులివెచ్చగా కాస్తోంది. ఎప్పుడెప్పుడు తెల్లవార్తుందా అని వేయి కళ్లతో ఎదురుచూసిన సుబ్బారావు తన భార్య ఎదురు రావడంతో చేత సంచీ, పుస్తకం పట్టుకుని బయలుదేరాడు. లక్ష రూపాయల లక్ష్మీ లాటరీ గెలిచిన సంతోషం అతని ముఖంలో కన్పిస్తోంది. విజేతలా నడుస్తున్నాడు సుబ్బారావు. నడుస్తూ నడుస్తూ పదే పదే తన చేతిలోని పుస్తకంవైపు చూసుకుంటున్నాడు. మిలమిల మెరుస్తున్న కళ్లతో కళకళలాడుతున్న తన భార్యాపిల్లలు, కడుపు నింపుతున్న సంతృప్తితో తన ముసలి తండ్రి ముఖాలు ఆ పుస్తకంలో సుబ్బారావుకు కన్పిస్తున్నాయి. ఆ పుస్తకాన్ని మరింత జాగ్రత్తగా పట్టుకుని వడివడిగా సాగుతున్నాడు. సుబ్బారావు సగటు మనిషి. ఒక బంగారపు నగల షాపులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. బంగారం ధరలతోపాటు బంగారంలా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల సంగతి అతనికి బాగా తెలుసు. కల్తీ లేకుండా బంగారం వస్తువులా మారదని అతని అనుభవం చెప్తే కల్తీ లేకుండా ఏ సరుకూ బజార్లో దొరకదని అతని జీవితానుభవం నేర్పింది. పదిసార్లు బంగారాన్ని గీటుపెట్టి, ధర్మకాటాల్లో తూకం తూయించుకుని మోసపోలేదనుకుని సంతృప్తిపడుతున్న ఈ వెర్రిబాగుల జనం నిత్యం తినే ఆహార వస్తువుల విషయంలో తప్పుడు తూకాలకు, కల్తీకి ఎందుకు అలవాటుపడిపోయారో సుబ్బారావుకు అర్థం తెలియని సమస్య. నడకలో వేగం పెరిగింది. తన చేతిలో పుస్తకం సుబ్బారావుకళ్లకు అక్షయపాత్రలా కన్పిస్తోంది. ఆరోజు ఆదివారం కావడం, అందునా అది నెలలో సంవత్సరంలో మొదటిరోజు కావడంతో సుబ్బారావు జేబులో కాస్త డబ్బుంది.



ప్రతినెలా వచ్చే జీతం, అయ్యే ఖర్చులకు సామ్యం కుదరక నిత్యం లోటు బడ్జెట్‌తో, అప్పుల భారంతో సతమతమయ్యే అతనికి ఈ ఏడాదిలో మార్పు కన్పిస్తోంది. తనకి పెళ్లయి రెండు దశాబ్దాలు గడిచాయి. తన చేతికా పుస్తకం వచ్చి ఐదేళ్ల కావస్తోంది. పుస్తకం చేతికందడానికి ఎన్ని తిప్పలు పడ్డాడో, ఎందరిచుట్టూ తిరిగాడో సుబ్బారావు మర్చిపోలేదు. పుస్తకం వచ్చిన మొదటిరోజు కూడా

ఇలాగే సంబరపడ్డాడు. అయితే ఆ సంబరం సందెపొద్దుదాకా కూడా నిలవలేదు. ఆకుపచ్చ రంగులోని ఆ పుస్తకం అతని జీవితాన్ని సస్యశ్యామలం చేయలేక తెల్లబోయి తెల్లగా రంగు మారింది.

పుస్తక ప్రయోజనం పొందాలంటే తిరుపతి వెంకన్నస్వామి 'క్యూ' గుర్తుకు వచ్చేది. ఆలస్యంగా వెళ్లి యజమాని చివాట్లు తింటం ఇష్టం లేక అతను ఆరోజు సెలవుపెట్టి పుస్తకం చేతబూని వెళ్తే వెళ్లినచోట కూడా సెలవుబోర్డు దర్శనమిచ్చేది. రెంటికిచెడ్డ రేవణ్ణ అయ్యేవాడు సుబ్బారావు. దాంతో కొద్దిరోజులు విసుగుచెందని విక్రమార్కుళ్లా తిరిగి తర్వాత విసుగొచ్చి పుస్తకాన్ని పెట్టె అరల్లో దాచేశారు. మళ్లీ ఇంతకాలానికి ఈ పుస్తకానికి కళ వచ్చినట్లు అతను ఫీలవుతున్నాడు. సుబ్బారావు గమ్యం దగ్గరపడింది.

తన యజమాని చెవినిల్లుకట్టి పోరినా, తాను, తన ఇంటిల్లిపాది కలిసి తమ పుస్తకానికి వన్నె వచ్చేట్లే చేసుకున్నామన్న సంతృప్తి అతని ముఖంలో ప్రస్ఫుటమవుతోంది. తమబోటివారంతా చేసుకున్న పుణ్యఫలం వల్లనే తమ పుస్తకాల విలువ పెరిగిందని అతను ఆనందపడుతున్నాడు. గత ప్రభుత్వం ఈ పుస్తకాన్ని లాక్కుని మరో తియ్యటి పుస్తకం ఇద్దామని ఎన్ని తిప్పలు పడిందో తమనెన్ని తిప్పలు పెట్టిందో అతను మర్చిపోలేదు. ఈ పుస్తకానికి నీకర్హత లేదని చెప్పడానికి దానికి సంబంధించిన అధికార్లు ఇంటిపైన పెంకుల్ని, ఇంటిలోని సామానులను, వంటిమీద గుడ్డలను చూస్తుంటే పుస్తకం నిలబెట్టుకోడానికి తాము పడ్డ పాట్లు అతను ఇంకా మరువలేదు. కాని ఆ ప్రభుత్వకాలంలో పుస్తకానికిచ్చిన విలువ పట్టుమని పదిరోజులు నిలువలేదు. సెలవు నాగా డబ్బులు యజమాని మినహాయించుకున్నా ఫర్వాలేదనుకుని ఒకరోజు సెలవుపెట్టి పుస్తకం పట్టుకుని వస్తే రెండుమూడు రోజులు తిరిగితేకాని తన పని పూర్తయ్యేది కాదు. అదీ తప్పుడు తూకాలు, కల్తీ సరుకుల్తోనే. కోల్పోయిన జీతం, దీనివల్ల వచ్చిన లాభం బేరీజువేసుకుంటే బేజారెత్తి పుస్తకం జోలికి పోవడంమానేశాడు. కాని ఇంతకాలానికి తన కలలు పండబోతున్నాయి. సుబ్బారావు తాను చేరాల్సిన చోటికి చేరాడు. తనలాంటివాళ్లు పెద్ద సంఖ్యలో అక్కడ పుస్తకాలు, సంచులు పుచ్చుకుని నిలబడి వున్నారు. తానుకూడా వెళ్లి వాళ్ల సరసన నిలబడ్డాడు. తమ పుస్తకాలకు ఇవ్వాల్సిన గౌరవ మర్యాదలు ఇవ్వలేదని ఒక ప్రభుత్వాన్ని దించి మరో ప్రభుత్వాన్ని గద్దెకెక్కించామని అందరూ అనుకుంటుంటే తానుకూడా వారికి వంత పాడాడు. ఎండ చుర్రుమంటోంది. అయినా ఎండ తీవ్రతను ఎవరూ లెక్కచేయడంలేదు. అందరి వదనాలు వికసించి వున్నాయి. ఈరోజు తొలి అమ్మకం మంత్రిగారు చేస్తారట, మొదట కొన్న పుస్తకందారునికి మెడలో దండకూడా వేస్తారుట, ఆడోళ్లు బాగా పాటుపడ్డారని ~~దండలు~~ వాళ్లకే వేస్తారట'' జనం చెప్పుకుంటున్నారు. దండ ఎవరికేస్తేనేమి పుస్తకాల పండగ జరుగుతోంది. తమ బ్రతుకుల్లో వెలుగు నిండుతోందని సుబ్బారావు సర్దిచెప్పుకుంటూ నిలబడ్డాడు. ఎండ తీవ్రత హెచ్చింది. తల మాడ్తోంది. కాళ్లు చుర్రుమంటున్నాయి. అయినా ఉత్సాహానికి అడ్డులేకుండా జనప్రవాహం చేరుతూనే వున్నారు. తమను గుర్తించి మాట నిలబెట్టుకున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ తమ ప్రతిఫలాన్ని పొందడానికి సిద్ధంగా వున్నారు.

కార్లు హారన్ మ్రోగించుకుంటూ వరుసగా వచ్చి నిలిచాయి. దుమ్ము బాగా ఎగిసింది. చాలామంది కళ్లలో పడింది. కళ్లలోపడిన దుమ్మును

సైతం మర్చిపోయి కళ్లింతలుగా చేసుకుని వేదిక ఎక్కుతున్న మంత్రివర్యులను, పెద్ద నాయకుల్ని చూస్తూ జేజేలు పలుకుతున్నారందరూ. పైన ఎండ అదరగొడ్తుంటే, నాయకులు, మంత్రిగారు వేదికను, జనాలను అదరగొట్టారు. తను ప్రభుత్వం ఎంత నిక్కచ్చిగా చెప్పినవన్నీ చేస్తుందో అనుకున్న టైమ్‌కంటే ఆరు గంటలు ఆలస్యంగా కార్యక్రమానికి విచ్చేసిన మంత్రిగారు బల్లగుద్ది చెబుతున్నారు. భోంచేసి వచ్చిన భుక్తాయాసాన్ని తీర్చుకుంటూ మిగిలిన వక్తలు ప్రజలకు సందేశం అందించేందుకు సిద్ధపడుతున్నారు. జనాలకు కడుపులో ఆకలి నకనకలాడుతోంది. సభా కార్యక్రమం అయింది. సుమారు మూడు గంటలు ప్రజల సహనాన్ని వక్తలు పరీక్షించారు. ప్రజలు ఐదేళ్లపాటుకూడా ఇదే సహనాన్ని కలిగి వుండి తీరతారని నాయకులు తీర్మానించుకున్నారు. ఆ తర్వాత కిలో రెండు రూపాయల బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభమయింది. మైకులో ఒక మహిళ పేరు పిలిచారు. రెండువైపులా రెక్కలు పుచ్చుకుని ఒక వృద్ధురాల్ని కార్యకర్తలు, అధికారులు తొక్కేస్తే మంత్రిగారు ఆవిడకు ఒక దండ వేశారు. తర్వాత ఆవిడకు బియ్యం తూచి పోశారు. ఆ హడావుడిలో కొద్దిగా బియ్యం నేలపాలైనా ఆ మహిళ పట్టించుకోలేదు. మెడలో దండ బరువు ముందు సంచి బియ్యం బరువు తెలీలేదు. తర్వాత మరో మహిళ.

మంత్రిగారి కార్ల కాన్వాయ్ దుమ్ము రేపుకుంటూ వెళ్లిపోయింది. జనం వరుసలుగా నిలబడుతూ తొక్కిసలాడ్తూ రెండు రూపాయల కిలో బియ్యాన్ని తీసుకుని వెళ్తున్నారు. సూర్యుడు పడమర దిక్కుకు వాలిపోతున్నాడు. సుబ్బారావుకు నీరసమొస్తోంది. కాని తెచ్చిపెట్టుకున్న ఓపికతో బియ్యం కోసం క్యూలో నించున్నాడు. డీలరు గుమాస్తాలు ఒక్కొక్కరిని వరుసగా పంపిస్తున్నారు. తూకాలు తూస్తూ పోతే ఆలస్యం అవుతుందని కొలతలు మొదలెట్టారు. ఐదు కేజీలకు ఈ డబ్బా, 10 కేజీలకు, 15 కేజీలకు, 20 కేజీలకు డబ్బాలు వచ్చాయి. తూకం మానేసి కొలుస్తున్నారు. ఒకరిద్దరు కాదు కూడదంటే తూకం తూస్తున్నారు. దీపాలు వెలిగాయి. సుబ్బారావు వంతొచ్చింది. సంచిలో ఆదరాబాదరాగా బియ్యం పడ్డాయి. బియ్యం సంచితో సుబ్బారావు ఇల్లు చేరేసరికి పిల్లలు నిద్రకు జోగుతూ తండ్రి తెచ్చే బియ్యానికి ఎదురు చూస్తున్నారు.

సుబ్బారావు ఇంటికి రాగానే అతని భార్య ఎదురు వచ్చి సంచి లోనికి చేర్చింది. ''మీరు బియ్యం తెస్తారని సాయంత్రం వంట ఇంకా మొదలెట్టలేదని చెప్తూ బియ్యం ఎన్ని కేజీలు తెచ్చారని అడిగిందావిడ.

''మనిషికి ఐదు కిలోల లెక్కను ఇరవై ఐదు కిలోలు తెచ్చాను''ని సుబ్బారావు చెప్పాడు.

''ఉండండి ఒకసారి కొలిచి చూద్దాం'' అంటూ ఆవిడ కొలత వేసింది. 18 కేజీలే వున్నాయి. మళ్లీ మళ్లీ కొలిశారు. అయినా అంతే.

''సరేలెండి కంగారులో తక్కువ కొలిచుంటారు. ఈసారి నిక్కచ్చిగానే వస్తాయంటూ ఆ పూట వంటకు బియ్యం ఏరుకోవడానికి ఆవిడ సిద్ధమవుతుంటే ప్రొద్దుటినుండి తిండిలేక ఒక రోజంతా నిలిచి తెచ్చిన బ్యింలో పడ్డ ఏడు కేజీల గండి, మరోవైపు నిక్కచ్చి మంత్రుల ప్రసంగాలు చెవులు మార్మోగుతుంటే తెల్లమొగం వేసుకోవడం తెల్లకార్డు సుబ్బారావు వంతైంది.